# ఇదో ప్రేమ కథ

రైలు రావడానికి ఇంకా అరగంట టైముంది. పదినిముషాల్లో మళ్ళీయోసారి టైము చూసుకుంటున్న రమేష్‌ని చూసి నవ్వాడు ప్రభాకర్.

నలభై రెండోసారి జేబులోంచి ఉత్తరం తీసి చదువుతున్న రమేష్‌ని చూసి మళ్ళీ నవ్వాడు ప్రభాకర్.

"నా బాధ నీకర్థం కాదులే" అన్నాడు. కాస్త నిష్ఠూరత మేళవించిన స్వరంతో ఉత్తరం చదువుతూనే రమేష్.

మన అనురాగ బంధం శాశ్వత బంధమయ్యేరోజు ఆసన్నమైంది. ఇన్నాళ్ళుగా నీ కోసం నిరీక్షిస్తున్న నా కళ్ళ తపన, హృదయారాటం మాన్పుకునేందుకు ఈ జయంతి సోమవారం నాడు గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో వస్తున్నది. ఆకుపచ్చ బార్డరున్న ఎర్రషిఫాన్ చీర, తల్లో ఎర్ర గులాబీతో వస్తాను. ప్రస్తుతానికి సెలవామరి....

నీ
జయంతి

రమేష్ కళ్ళముందు ఎర్రటి షిఫాన్ చీరలో అందంగా నాజూగ్గా ఉన్న జయంతి రూపం కదులుతుంది.

జయంతి వస్తుందంటే పిచ్చి ఆనందంగా ఉంది. ఇన్నాళ్ళకి తన కోరికలకు సన్నిహితంగా, అభీష్టానికనుకూలంగా తానే అన్వేషిస్తున్న సజీవమూర్తి ప్రత్యక్షం కానున్నది.

జయంతితో పరిచయమంతా ఉత్తరాలతోనే.

"ఏమిటి రమేష్ అంత దీర్ఘాలోచనలో పడిపోయినావ్" అని ప్రభాకర్ అంటున్నా జయంతితో ఏర్పడిన సన్నిహితత్వం ఆమె వ్రాసిన ఉత్తరాల పరంపర అన్నీ కనులముందు కదలాడుతుంటే రమేష్ పూర్తిగా ఆలోకం లోకి వెళ్ళిపోయినాడు.

నాలుగు నెలల కిందట ఆరోజు ప్రభాకర్ వస్తూనే రమేష్‌తో అన్నాడు: జీవితం పెళ్ళితోకానీ పరిపూర్ణంకాదు. రమేష్! ఒక్కసారి ఆలోచించు"

"పరిపూర్ణం కాదు నా బొంద అవుతుంది నన్నిట్లా వదిలెయ్యరా అంటే వినవు. నేను పెళ్ళిచేసుకోను" విసుగ్గా అన్నాడు ప్రభాకర్.

"నువ్వెన్నన్నా నేను చెప్పేది చెప్పక మానను" మొండిగా అన్నాడు ప్రభాకర్.

"నేను వినను"

"ఒక్కసారేదో ఘటన జీవితంలో మనకు వ్యతిరేకంగా జరిగిందని ఎప్పుడూ అట్లాగే జరుగుతుందను కోవడం తెలివి తక్కువతనం దాని ఆధారంగా జీవితంమీద ద్వేషం పెంచుకోవడం అవివేకం".

"అబ్బ! ప్రభా! నీ సంస్కృతం నాకు అర్థం కాదు. అయినా ఈ మధ్య నీ పాఠాలు వినలేక చస్తున్నాను."

"పోన్లే నా సంస్కృతం నీకర్థం కాకపోతే ప్రమాదం లేదుకానీ ఇది చూడు" అంటూ వారం రోజుల నాటి దిన పత్రిక ఒకటీ, ఓ ఉత్తరాల కట్ట అక్కడ పడేశాడు ప్రభాకర్.

"ఏమిటవి?" అయోమయంగా చూస్తూ అన్నాడు రమేష్.

పేపర్లోని ప్రకటనల పేజీలో "వధువు కావలెను శీర్షిక కింద రమేష్ వివరాలతో, అమ్మాయికి కావలసిన లక్షణాల వివరాలనిస్తూ ప్రకటన.

"నాకు తెలియకుండా ఈ పనెప్పుడు చేశావు?" ఆశ్చర్యంగా అడిగాడు రమేష్.

ఆ మాట వినిపించుకోకుండా ప్రభాకర్ "ఇదిగో ఆ పేపర్ ఆఫీసుకెళ్ళి ఉత్తరాలు కూడా తెచ్చాను చూడు" అన్నాడు ఉత్తరాల బొత్తి ముందుకు తోస్తూ.

రమేష్ ఎక్కువగా వాదన పెంచకుండానే ఒక్కొక్కటీ ఉత్తరాలన్నీ చదివాడు. పెళ్ళికూతుళ్ళ తండ్రులో, అన్నలో, మామలో వ్రాసిన ఉత్తరాలవి. వధువు వివరాలతో రమేష్ ఏమంత సంతృప్తి చెందక చాలా ఉత్తరాలు పక్కన పెట్టేశాడు. ఇక మిగిలినవి, ఆలోచించ తగినవి, రమేష్ కోరికలకు దగ్గరగా ఉన్నవీ మూడు ఉత్తరాలున్నాయి. అందులో ఎక్కువగా రమేష్ని ఆకర్షించిన ఉత్తరమొకటు

న్నది. అది ఆ అమ్మాయి స్వయంగా వ్రాసినది. పేరు జయంతి ఆ ఉత్తరాన్ని ఆసక్తిగా చదివాడు రమేష్.

"నా పేరు జయంతి. పెళ్ళి కావలసిన వధువుని నేనే. నాకు ఆత్మీయులెవరూ లేరు. నాన్న తప్ప. నాన్న అనారోగ్యంతో మంచం పట్టి చాలా కాలమైంది. అందువల్ల నా జీవిత భాగస్వామిని నేనే ఎన్నుకోవలసిన అవసర మేర్పడింది. ఇక్కడే బ్యాంకులో క్లర్కుగా ఉంటున్నాను. గ్రాడ్యుయేట్‌ని. పెళ్ళి ప్రయత్నంలో ఇంతకు ముందెవరి ముందు నేనే నా మనసు విప్పలేదు. ఏ కారణం వల్లనో కానీ మీ ప్రకటన చూసిన తరువాత ఉత్తరం వ్రాయాలనిపించింది. అందానికి ఊర్వశిని కాను, అనాకారినీ కాను. నా వ్యక్తిత్వాన్ని గౌరవించే మంచి మనసున్న హృదయంలో శాశ్వతమైన చోటు దొరికితే నేను ఆ వ్యక్తిని మనసారా నా మనసులో నిలుపుకుంటాను– సరి ప్రస్తుతానికి సెలవు.

జయంతి.

"చాలా చొరవగల పిల్లలాగ ఉన్నది" అన్నాడు తానుకూడ ఉత్తరం చదివిన ప్రభాకర్. రమేష్ దీర్ఘంగానే ఆమె ఆలోచనల్లో మునిగి పోయాడు.

కొంచెంసేపు రమేష్‌ని ఆలోచనల్లో వదలిన తర్వాత "జవాబు వ్రాయి" అన్నాడు

"వ్రాయమంటావా?" అన్నాడు సంశయంగా రమేష్.

"వ్రాయకపోతే నేను నీకోసం ఎందుకింత శ్రమ పడ్డానంటావు?" అన్నాడు కాస్త విసుగ్గా ప్రభాకర్.

రమేష్ ఏమనుకున్నాడో ఆ ఒక్క ఉత్తరానికి మాత్రం అప్పటికప్పుడు జవాబు వ్రాసేశాడు. అప్పటికే ముక్కూ మొగం తెలియని ఆ అమ్మాయి తన ఆలోచనలను పూర్తిగా ఆక్రమించు కున్నది.

"ఇదిగో రమేష్! నన్నెదురుగా కూర్చోబెట్టి నువ్విట్లా కలలు కనడం ఏం మర్యాదగా లేదు. నేను వెళ్తున్నాను" అంటూ లేచాడు ప్రభాకర్.

"సారీ ప్రభా! మనసు అస్తవ్యస్తంగా, ఆందోళనగా ఉన్నది"

రోజు లెప్పుడూ ఒక లాగ ఉండవు. పరిస్థితులుకూడా ఒకలాగ ఉండవు.

"నా జ్ఞాపకాల పొరల్లో అప్పుడప్పుడు నళిని మెదుల్తూ ఉంటుంది. మేమెందుకు కలిశామో ఎందుకు విడిపోయామో తెలియదు. అప్పుడే 12 సంవత్సరాలు గతించిపోయినై. ఆ అమ్మాయి చాలా అహంకారంగా, పొగరుగా ఉండేది ఒకసారి మాటకు మాట అంది. వాతలు తేలేట్టు కొట్టాను. అంతే నళిని అప్పటికప్పుడే ఇల్లు వదలి వెళ్ళిపోయింది. తప్పెవరిదో తెలియదు. ఎందుకో ఆ అమ్మాయి మీద నాకు ప్రేమ కలగలేదు. ఆమెకూ అంతేనేమో-తర్వాత సంవత్సరం మేము విడాకులు తీసుకున్నాం. కలిసి కాపురం చేస్తే ఎదిగిన పిల్లలు ఉండేవాళ్ళు...." అన్నాడు నిట్టూరుస్తూ రమేష్.

రమేష్ వస్తుతః చాలా మంచివాడు మరి ఈ ఘటన జరగడానికి బాధ్యతెవరిదో.

"సరే- అది భూతకాలం- భూతం వర్తమానానికి అప్రస్తుతం. ఒంటరిగా ఎన్నాళ్ళుంటావు. జీవితానికి తోడు అవసరం నువ్వు చిన్నవాడివికాదు. నీ వయసు ఇప్పుడు 35 సంవత్సరాలు. ఇంకా పెళ్ళి ఎక్కువ రోజులు వాయిదా వేయడం బాగుండదు." అన్నాడు ప్రభాకర్ అనునయంగా.

"అవును ప్రభా! తోడు కోసమే నేనిప్పుడు ఆరాటపడేది కాని పెళ్ళి లాటరీ లాంటిది కదా అని భయం" అన్నాడు రమేష్. అసలైతే పెళ్ళెప్పుడు చేసుకుంటావ్? అని ప్రశ్నించే వాళ్ళ బాధ ఎక్కువై పోయింది.

ఒకప్పటి చేదు జ్ఞాపకాలు మనస్సును వెనక్కి లాగుతున్నా, తిరిగే జంటలను చూస్తే మనసేదోలాగుంటుంది. ఒక్కోసారి సినిమాలో ప్రణయ జీవితంలా గువ్వల జంటలా ఎగిరిపోవాలనుంటుంది.

మళ్ళీ అన్నాడు సాలోచనగా 'జయంతి దగ్గర్నుంచి జవాబొచ్చే సరికి ఎన్నాళ్ళు పడ్తుందో' అని. జయంతి వ్రాసిన ఉత్తరం అతని మీద ప్రభావం చూపించినట్లుగా తన మనసుకే తెలుస్తూంది. చాలా అర్జంటుగా సంసార సుఖాలను పడగట్టుకోలవాన్న తాపత్రయం కలుగుతున్నది రమేష్‌లో.

"ఏమో ముందు నీ పరధ్యానాన్ని భరించలేక నేను సతమతమవుతున్నాను. ఉత్తరం వచ్చి ఒక గంటన్నా కాలేదు. జయంతి దేవి

గారు నీ మనసులో తిష్ఠ వేశారు" అన్నాడు సరదాగా ప్రభాకర్.

"సారీ ప్రభా!" అన్నాడు రమేష్, ప్రభాకర్ వెళ్ళిపోయినాడు.

సరిగ్గా నాలుగో నాటికి జయంతి దగ్గర నుంచి జవాబు వచ్చింది.

శ్రీ రమేష్ గారికి నమస్సులు,

మీ ఉత్తరం అందింది. మీ లేఖ ద్వారా మీ నిరాడంబరత, హాబీలు, అలవాట్లు అన్నీ అర్థం చేసుకున్నాను. ఇన్నాళ్ళుగా నేను అన్వేషిస్తున్న వ్యక్తి మీరేనేమోననిపిస్తున్నది. కవిత్వం చెప్తున్నానని నవ్వుకుంటున్నారా? ఆడపిల్ల ఇట్లా మాట్లాడటమేమిటని విస్తుపోతున్నారా? నేను పసిపిల్లను కాను నా వయసు 30. లేత వయసు యవ్వనంలో లేచి పడే కెరటాల్లాంటి అనుభూతుల తాకిడులన్నింటినీ గడిచి ప్రశాంత చిత్త స్థైర్యాన్ని అలవరచుకున్న ప్రౌఢను. మీ హృదయాన్ని, మీ మూర్తిమత్వాన్ని మనసులో అంచనా వేసుకుంటున్న జయంతికి మీ అభిప్రాయాన్ని తెలుపగోరుతున్నాను.

జయంతి

రమేష్‌కి చాలా థ్రిల్లింగా ఉంది. మళ్ళీ పాతికేళ్ళ యవ్వనంలోకి వెళ్ళిపోయినట్లుగా ఉంది. మనసంతా చెప్పలేని అనుభూతులు. ఈ వయసులో తాను చూడని ఒక అమ్మాయికి ప్రేమలేఖ లాంటిది వ్రాయడం అనే ఆలోచనే చిత్రంగా ఉంది.

ఆలోచనలు, అనుభూతుల కలబోతలలో ఇద్దరి మధ్యా రెండు నెలల స్నేహవారధి- ఒకరినొకరు చూసుకోలేదన్న లోటు తప్ప చిర కాలంగా ఎన్నో జన్మలుగా అనుబంధం పెనవేసుకొన్న మిత్రుల్లా ఎన్నో లేఖలు, ప్రతి ఉత్తరం అనురాగ తుంపరగా, నీరెండలో వాన పడిన తర్వాత విరిసిన హరివిల్లులా-ఓహ్ జీవితంలో ఇంత మధురిమ ఉందా అని ఇప్పుడు క్షణ క్షణం రమేష్ ఆశ్చర్యపోతున్నాడు. ఆదర్శ దంపతుల్లా జీవితాన్ని కడతేర్చాలన్న ఆశలు, ఇద్దరి మనసుల్లోనూ పరిణయ వీచికలు.

ఆమె చూస్తే అతని మనసులో స్పందన.

అతని ఉత్తరం చూస్తే ఆమె హృదయంలో ఎగిసిపడే ప్రేమ తరంగాలు.

ప్రేమలో ఇంత మత్తు ఉన్నదని రమేష్ అనుకోలేదు. ఎందు కంటే రమేష్ దాని జోలికెప్పుడూ పోలేదు.

సాన్నిహిత్యం పెంచుకొనే నెపం మీద ఉత్తరాలు కొనసాగినై. కానీ అతడు ఎప్పుడెప్పుడు ఆమె సన్నిధిలో కాలం గడపాలా అని ఆరాటపడ్తున్నాడు.

"జయంతీ!"

ఇక నేనీ ఎడబాటునూ, విరహాన్నీ భరించలేను నన్ను రమ్మం టావా లేక ఈ భక్తుడి ముందు ప్రత్యక్షమవుతావా.

నీ

రమేష్

ఆ ఉత్తరానికి జవాబుగానే జయంతి తాను గోల్కొండలో వస్తున్నట్లు వ్రాసింది.

జయంతికి మానసికమైన ఎదుగుదల లేని చిన్న వయస్సులో పెళ్లైందట. విడాకులు తీసుకున్నారని వ్రాసిందెప్పుడో.

ఏమైనా ఈ కలయిక మాత్రం అపూర్వం, అద్భుతం కూడా.

ఉత్తరం ప్రభాకర్‌కి చూపించి స్టేషన్‌కి వెళ్దాం రమ్మంటే.

"మీ సమాగమంలో నా రాక, పానకలో పుడక...." అన్నాడు నాటక ఫక్కీలో.

"చాల్లే కవిత్వం- నువ్వు రాకపోతే నేనూ వెళ్ళను" అన్నాడు కినుకగా రమేష్.

ఇద్దరూ స్టేషన్‌కొచ్చారు. రమేష్ గుండె చప్పుడు తనది తనకే వినిపిస్తున్నట్లున్నది.

" ఏయ్ రమేష్ రైలు వస్తున్నది" ప్రభాకర్ అనడంతో ఆలోచనల్లోంచి బయటికి అడుగు పెట్టాడు రమేష్.

గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను అంత దూరం నుంచి చూస్తుంటేనే రమేష్ మనసు చిత్రంగా స్పందిస్తున్నది. చిత్రమైన అనుభూతులతో భాషకందని భావాలతో వివశమైపోతుంది.

రైలు స్టేషన్‌లో ఫ్లాట్‌ఫారం దగ్గర వేగం తగ్గి మెల్లగా ఆగింది రమేష్ నేత్రాలు తన జీవిత సహచరిణి కోసం అటూ, ఇటు పరుగులు పెడ్తున్నాయి.

నాలుగయిదు నిముషాల్లో ఆతని నిరీక్షణ ఫలించింది.

తగినంత ఎత్తు, లావు ఆకర్షణీయమైన ముఖ వర్చస్సు మళ్ళీ చూడాలనిపించే ఏదో అంచం, చిరునవ్వుతో ఎర్ర చీరెలో రైలు దిగిన ఆ అమ్మాయిని చూస్తూనే రమేష్ గుండె లయతప్పినట్లయింది.

"ఆమె....ఆమె....నళిని....తన....విస్ఫారిత నేత్రాలతో విభ్ర మంగా ఆమె వైపు చూస్తున్నాడు రమేష్.

జయంతి రమేష్‌ను సమీపించింది. ఆమె వదనంలోనూ అంతులేని ఆశ్చర్యం....అతను....అతను.... చంద్రం.

ఒకర్నొకరు మాటపలుకు లేకుండా చూసుకుంటున్న రమేష్ జయంతిలను, ఆశ్చర్యంగా చూస్తూ 'రమేష్' అన్నాడు ప్రభాకర్.

"ఏమిటిది"-అన్నాడు మళ్ళీ-అప్పటికి ఇద్దరు తేరుకున్నారు.

"జీవితంలో ఎట్లాంటి సంఘటనలు జరిగినా ఆశ్చర్యపోనక్కర లేదని మా జీవితం రుజువు చేసింది ప్రభాకర్ గారూ!...." అంది జయంతి ముందుగా.

అప్పటికీ ప్రభాకర్‌కి సంగతేమిటో తెలియలేదు.

దాన్ని సూక్ష్మంగా తేల్చేస్తూ "మేమిద్దరం ఒకప్పటి భార్యాభర్తలం" అన్నాడు. ఇప్పుడు షాక్ తినడం ప్రభాకర్ వంతయింది. కానీ వెంటనే అతనిలో భయం ప్రవేశించింది. ఇంతదూరం సవ్యంగా నడచిన కథ విషాదాంతమవుతుందా అని.

కానీ తలెత్తి పరిశీలించిన ప్రభాకర్‌కి వాళ్ళ ముఖాలు ఒకరిపట్ల ఒకరికి వారిలో పెరిగిన ఆత్మీయత, ఆకర్షణ, ఆరాధన, గత స్మృతుల పరంపరల ఒరవడిలోనైనా తళుక్కుర మెరిసినై. ఇప్పుడు నళినీ జయంతి, రమేష్‌చంద్ర ఒకరి చేతిని మరొకరు పట్టుకుని స్కూటర్ స్టాండువైపు నడుస్తుంటే కథ సుఖాంత మయిందనుకుంటూ నిట్టూర్చి బస్ స్టాండు వైపు పరుగెత్తాడు ప్రభాకర్.

(ఆంధ్రప్రభ దినపత్రిక 28-8-'85)